


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### దెయ్యాల సొగసు

**అసలా టినో పాల్** చీరలు తెల్లగా కొంగ రెక్కలలా ఫెళ ఫెళ మంటుండగా..రీటా నూనె అని మా చిన్నప్పుడు చందమామలో,'ఒత్తైన శిరోజాలకు' అని ఎడ్వటైజ్ చేసేవారు..అలాంటి జుట్టు విరబోసుకుని.."నిను వీడని నీడను నేనే.".అనో" రాజా పిలుపు నీ కోసమే"..అనో విజయ లలిత లా వస్తూ వుంటే..ఆహా అందం అంటే అసలు దెయ్యాలదే..పైగా సుశీలలా మత్తకోకిల వంటి కంఠం..బతికున్న ఏ పిల్ల నైనా వదిలేసి ఆ దెయ్యం కోసం వెళ్లిపోడటండీ ఎవడైనా..అలా అందాలు ఆరబోసే దెయ్యాలని వదిలేసి ఈ రాంగోపాల వర్మ లాంటి వాళ్లు మొహాలకి ఈ మట్టున పౌడర్ అద్ది కళ్లకి కాకుండా కిందకుడా ఎర్రగా కాటుక రాసి పిచ్చికల గూడు లాంటి వెంట్రుకలు విరబోసి అసలు దెయ్యాల గ్లామర్ ని దెబ్బ తీసారు.

దెయ్యాలకంటూ ఓ ఫెడరేషన్ వుంటే ఈయన మీద కేసు పెట్టాలి. నిన్న ఓ సినిమ చూసా..అందులో దెయ్యానికి అసలు తెలివి లేదు..విఠలాచార్య గారు బతికుంటే వాతలు పెట్టి తెలివి తెప్పించేవారు..ఆ దెయ్యం నయన తార..సినిమా పేరు నేత్ర ట..డబ్బింగ్ పేరులెండి..మూసి వున్న తలుపు లోంచి వెళ్లనంటుంది..ఎవరినీ గుర్తు పట్టదు..అంతెందుకూ అసలు తన పేరే తనకి తెలీదు ఆమ్నీషియా వచ్చిందని ఇంగ్లీష్ లో చెప్పింది..అసలు మన విఠలాచార్య గారి సినిమాల్లో జగన్మోహినిలో గంధర్వకన్యలో దెయ్యాలది ఏం అందమండీ? జయమాలినా..మజాకానా?పైగా ఎంత మగాడనైనా చిలకగా మారుస్తుందీ..పొట్టేలుగా మారుస్తుంది..ఇంకా చిరాకేస్తే గోడ మీద బల్లి గా కుడా మార్చగలదు..ఇంక పొట్టి పొట్టి మరుగుజ్జు దెయ్యాలు గ్యాస్ అయిపోయిందనో ఇంట్లో కిరోసిన్ లేదనో చతికిలపడకుండా కావాలంటే కాళ్లు పొయ్యి లో పెట్టి జుట్టు విరబోసుకుని వంట చేస్తాయి..చచ్చాం భయంతో

మా చివరింటి వాళ్ల చిట్టికి దడుపు జ్వరం కుడా వచ్చిందా సినిమా చూస్తే..అసలు దెయ్యాలు రాజ్యం ఏలిన రోజులు కదా అవీ..ఏ రూపంలోకి అయినా మారకలవు..ఎంత చక్కని కాస్ట్యూమ్ అయినా వేసేసుకోగలవు..చచ్చిపోయాకా

ట్యుటోరియల్స్ కి వెళ్లి సివిల్స్ కి ప్రిపేర్ అయినట్టు అతి తెలివి..ఎంత ప్లాన్ అయినా వేసి ఎలాంటి వాడినైనా చిత్తు చేస్తాయి..మొన్నా మధ్య ఇంకో సినిమా లో ఆ దెయ్యం గుడ్డిదట..ఏమైనా అర్ధం వుందా?చచ్చాకా కుడా అవకరాలూ రోగాలూ వుంటే వీటికి ఆరోగ్య శ్రీ కార్డులెక్కడనుండి తేవాలీ?దెయ్యం అంటే దానికి అపూర్వ శక్తులుండాలి..అత్యంత సౌందర్యం, విపరీతం తెలివి తేటలూ వుండాలి..అంతే కానీ నేను మేడ మెట్లు ఎక్కలేను వర్టిగో వుందీ..బీపీ వుందీ షుగరుందీ..కిడ్నీలు దొబ్బాయి అంటే అది దెయ్యం ఎట్లా అయిందీ..

చిన్నప్పుడు మా కాలనీ లో ఒకావిడకి దెయ్యం పట్టిందన్నారు..ఎందుకంటే సా పా సా రాని ఆవిడ అద్భుతంగా కీర్తనలు స్వరాలతో సహా పాడేస్తోందిట..ఇంకో దెయ్యం అర్ధరాత్రి లేచి కూర్చుని షేక్ స్పియర్ నాటకాలు హామ్లెట్ లాంటి వి డైలాగ్స్ అన్నీ చెప్పేసిందట..ఇంగ్లీష్ ముక్క రానావిడ..అట్లా తెలివైన దెయ్యాలు పట్టాలికానీ..నాకు ఆమ్నీషియా, అతి మూత్ర వ్యాధీ అనే దెయ్యాలు ఏంటి ఖర్మ..మరీ ఈ సినిమాల వాళ్లు దెయ్యాల పరువు తీసేస్తున్నారు..ఒక జడల మాంత్రికుడొచ్చి.."దిగూ" అంటే

"దిగనూ".

."దిగక పోతే ఏం చేస్తానో చూడూ" అని వేప మండలతో బాది" అమ్మోరి శక్తి మహో..అంకాళ దేవి మహో..మా వూర వెలసినా జడల మారమ్మ మహో"..అని పాడి

"ఎవరు నువ్వు..ఏ వూరు నీది..నీకేం కావాలి..అంటే మన మిలట్రీ ఆఫీసర్స్ లని కిడ్నేప్ చేసిన టెర్రరిస్ట్ల లా బోలెడు డిమాండ్లు పెట్టి.."నా మాజీ మొగుడు మళ్లీ పెళ్లి చేసుకున్నాడు..వాడు పెళ్లాన్ని వదిలెయ్యాలి..నా కొడుకుని ఆ సవతి తల్లి నానా బాధలూ పెడ్తోంది" అంటే..ఏదో జాలి కలిగేది చచ్చినా ఎంత ప్రేమ ఈ దెయ్యానికని.

మా కాలనీ లో ఒకరింట్లో దెయ్యాలని వదలకొట్టే గురువుగారు దిగారు.."మా ఆవిడ వంట చెయ్యదండీ..స్నానం చెయ్యదండీ..వారపత్రికల దెయ్యం పట్టిందండీ వద్దు చదవంటే కొరుకుతోందండీ ఎలాగైనా ఈ దెయ్యాన్ని వదిలించండని"బతిమాలాడు ఇంటాయన. గురువుగారు ఏ మంత్రం వేసారో ఆవిడ స్నానం చేసి స్నో కుడా రాసుకుని రాజసులోచనలా పూలు పెట్టుకుని కొప్పు చుట్టూ, సెంట్ కుడా కొట్టుకుని ఎంచక్కా నాలుగు రోజులు వంట చేసింది బంగాళాదుంప వేపుడు తో సహా!..ఇంటాయన ఉబ్బి తబ్బిబ్బు అయి గురువుగారికి పట్టు పంచెలూ వెయ్యినూట పదహార్లూ ఇచ్చాడు. ఆ రాత్రే దెయ్యం పట్టినావిడా ఆవిడ ఆరు వారాల నగలూ తో గురువుగారు మాయం..మళ్లీ కనపడలా..ఇలాంటి దొంగ దెయ్యాలూ వుంటాయి..నాకు నచ్చే దెయ్యాలు మాత్రం పడుకున్న చోటు నుండే నాలిక జాపి లాంతర్ వత్తి ఎగదోసేవీ..అలా అలా చీపురు కట్టలూ అప్పడాల కర్రలూ గాలిలో తేలుతూ వచ్చేట్లు చేసి గయ్యాళి అత్తగార్లని వాయించేవీ..జగన్మోహినీ మరు గుజ్జు దెయ్యాల్లా కామెడీ చేసేవీ..పాపం హెయిర్ స్టైల్ చేసుకోకుండా జుట్టు విరబోసుకుని

శంకర్ జైకిషన్ సంగీతం లో పాటలు పాడేవీనూ..ఈ మధ్య అసహ్యంగా పాకే దెయ్యాలనీ, బూడిద రాసిన పౌడర్డ్ ఫేస్ దెయ్యాలనీ చూస్తే గౌరవం కలగట్లేదబ్బా!!!

అసలు హిందీ సినిమాల్లో దెయ్యాలండీ పూర్వపు స్మృతులతో వైజయంతీ మాలలా అందంగా వుంటాయి. 'ఏ కోన్ హస్‌తా హై. పూలోం మె చుప్ కళ్" అని పాడేంత అందంగా వుంటాయి. అసలు దెయ్యాలు ఇంత అందంగా వుంటాయి అంటే మామూలు అమ్మాయిలని ఎవరు ప్రేమిస్తారు చెప్పండీ?

మా ఇంటి దగ్గర చింతా వారి కోడలుకి దెయ్యం పట్టిందన్నారు. ఇంకేం వుందీ, వేపమండలతో కొట్టడం, మొహాన కుంకుమ బొట్లూ, తీసుకెళ్ళి దర్గా దగ్గర కాళ్ళకి తాళాలు వేసి, కట్టెయడం ఇవన్నీ చేసారు. ఇంతకీ ఆ అమ్మాయికి గదిలోకెళ్ళి మొగుడూ మీద చెయ్యివేస్తే దెయ్యం పట్టి అరుస్తోందట. ఆ దెయ్యం ఎవరో లంబాడీ పిల్లదనీ, ఈ పిల్ల మిట్టమధ్యాహ్నం, జుట్టు చివర్ల ముడి వేసుకోకుండా, చింతచెట్టు కిందకి వెళితే, ఆ జుట్టు కొసలు పట్టుకుని వేలాడుతూ ఈ అమ్మాయితో వచ్చేసిందనీ చెప్పుకున్నారు.

అలా ఓ నెలరోజులు దెయ్యం .. దెయ్యం అని నానా బాధలూ పెట్టాక, ఇంటికి తీసుకొచ్చిన రోజునే నగలూ, డబ్బుతో, సంగీతం మాస్టారుతో ఉడాయించిన పిల్ల, పిల్లలిని కని, పదికాలాలు చక్కగా వుందని మా అమ్మమ్మ చెప్పేది. ఆ దెయ్యం పిల్లకి కాదు. ఆ మొగుడికే పట్టి, పిల్లని గదిలో హింసించి వుంటాడు. వాతలు పెట్టాల్సింది ఒకరికైతే, వైద్యం ఇంకొకరికి చేసారు.

మా చిన్నప్పుడు శ్యామలమ్మ చెపుతుంటే, నోరు తెరుచుకుని విని రాత్రి నిద్రపట్టక, భయంతో గడ్డకట్టి, మధ్యలో మెలుకువ వస్తే, పెద్దవాళ్ళని లేపితే, "నానా చెత్త కథలూ విని, రాత్రి నా ప్రాణాలు తీస్తారు" అని అమ్మ విసుక్కున్న కథ ఒకటి వుంది.

శ్యామలమ్మ వాళ్ళ ఊళ్ళో, ఓ రాత్రి పెద్ద పెద్ద పెట్రోమేక్స్ లైట్స్ తీసుకుని, గానా బజానాలు చేస్తూ ఓ పెళ్ళి బృందం వచ్చిందిట. పెళ్ళికొడుకునీ, పెళ్ళి కూతురినీ ఊరిమీద ఊరేగించి, వచ్చిన వాళ్ళకి కోడికూరతో భోజనాలు పెట్టి, అర్ధరాత్రి దాకా సంబరం చేసారట. వెళ్ళిన ఊరి జనం బాగా తిని తాగి పడిపోయారుట. తెల్లారి లేచి చూస్తే, దిబ్బలూ స్మశానంలో వున్నారట. అక్కడ పెళ్ళి కూతురి అలంకరణలో, పెళ్ళికొడుకుగా రెండు కంకాళాలు పడి వున్నాయిట. చూట్టూ బొమికలూ, పసుపూ కుంకుమ కలిపిన అన్నంట. రాత్రి పెళ్ళివాళ్ళు భళ్ళున కక్కుకుని భయంతో బతుకుజీవుడా అని ఊళ్ళోకొచ్చి పడ్డారుట.


ఇలాంటి కథలు వింటూ పెరిగాం. కొన్ని చందమామ కథల్లో దెయ్యాలు చాలా మంచివి. పరోపకారం చేసేవినూ. నేను సందానీగాడూ శ్మశానంలో బూరెలూ గారెలు చేసుకెళ్ళి "మంచి దెయ్యాలున్నాయా? ఇవి తిని మాకు కుండెడు

డబ్బులియ్యండి ప్లీజ్" అని అడుగుదాం అని చిన్నప్పుడు ప్లాన్ చేసుకున్నాం కూడానూ. మాఅమ్మమ్మ దానికీ అడ్డుపడింది. లేదంటే బోలెడు డబ్బులుండేవి ఇప్పుడు ఎంచక్కా.

ఇంక మళ్ళీ సినిమాల విషయానికొస్తే, ఎప్పుడూ పాడుపడ్డ బంగళా ముందే కారు పాడవుతుంది. నలుగురు అబ్బాయిలూ, నలుగురు అమ్మాయిలూ, చిన్న చిన్న బట్టలేసుకుని, బంగళాలోకి వెళ్తారా? "కౌన్ హై?" అంటూ చూడగానే దడ పుట్టేలాంటి, ముసలి వాచ్‌మెని ఏం చెయ్యవు అదేంటో. ఇంకా ఈ కుర్ర వెధవల్ని టాంక్‌లోంచి రక్తం తెప్పించీ, ప్లేట్లో పెట్టిన టిఫిన్, బొద్దింకలూ, తేళ్ళుగా కనిపించీ హింసపెడ్తాయి. అన్నింటికన్నా చిరాకు వేసేది తలుపు తోసారా కిర్..ర్..ర్ర్..ర్ అంటూ నరాల్లో వణుకు పుట్టించే శబ్దం. ఏం ఆ వాచ్‌మెన్ వెధవ కాస్త నూనె వెయ్యకూడదూ తలుపుల సందునా? అందులో ఓ కుర్ర దెయ్యం, హీరోమీద మనసు పడ్తుంది,హీరోయిన్ రూపంలో వచ్చి, అతనితో రొమేన్స్ చేస్తుంది. అసలు ఆ మేకప్, కాస్ట్యూమ్స్ కొత్త స్టైల్స్ అన్నీ ఈ దెయ్యాలకి తెలిసినట్లు ఎవరికీ తెలియవు. వీళ్ళని మిస్ ఇండియా కాంపిటీషన్స్ కి పంపితే, షీల్డ్ కొట్టే వెనక్కి వస్తారు. ఇరక తిరక ప్రశ్నలు వేసే జడ్జీల పీకలు కొరికి రక్తం తాగి మరీ రాగలరు.

సో.. గత జన్మ కథలు రాగయుక్తంగా, పాటగా పాడుతూ, అందంగా వుండే దెయ్యాలు మీకు కనిపిస్తే వాటికి చెప్పండి. జుట్టుకి నూనె రాసి జడేసుకోండి. పిచ్చిగా పాడుచేసుకోకండి. చీరల్లో రకరకాల పట్టు చీరలొస్తున్నాయి ఉప్పాడ, సాముద్రిక, పోచపల్లి లాంటివి. ఇంక ఈ తెల్లచీరలు ఫ్యాషన్ కాదని.

Post your comments









https://www.youtube.com/watch?v=ERaaX_IulS4